కందాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

అన్నదానం చేస్తున్న కందాల ఉత్సవకమిటీ సభ్యులు

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 17: గణేశ్ వేడుకల సందర్భంగా పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అనుచరులు, కందాల ఉత్సవ కమిటీ నిర్వాహకులు కలిసి మండలంలోని పెద్దతండా ఇందిరమ్మ కాలనీలో మంగళవారం మెగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకుడు మేకల ఉదయ్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులు మానుకొండ శ్రీనివాస్, నాశబోయిన కనకయ్య, బానోత్ కృష్ణ, బాణోత్ వీరన్న, ఏపూరి తరుణ్ తదితరులు హాజరయ్యారు, తొలుత వారు గణనాథుడి మండపంలో ప్రత్యేక పూజలు చేశారు.

వినాయక మండపాల వద్ద అన్నదానం

వైరా రూరల్, సెప్టెంబర్ 17: మండలంలోని సిరిపురం కేజీ గ్రామంలో మంగళవార వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండకొడిమలోని వినాయక మండపం వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాటలో గ్రామానికి చెందిన దొంతెబోయిన అనిల్‌కుమార్ పాల్గొని లడ్డూను రూ. 15,116 వేల దక్కించుకున్నారు.

వినాయక లడ్డూను రూ.75వేల దక్కించుకున్న మాజీ ఎంపీటీసీ

వేంసూరు, సెప్టెంబర్17: మండలంలోని కల్లూరుగూడెం గ్రామంలో రాములోరి గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద సోమవారం రాత్రి లడ్డూ వేలంపాటలో బీఆర్ఎస్ నాయకులు, మాజీఎంపీటీసీ గొర్ల శ్రీనివాసరెడ్డి రూ.75 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

బోనకల్లు, సెప్టెంబర్ 17: విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో బోనకల్లులోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంఘం బాధ్యులు వజ్రాల సత్యనారాయణ, బూర్గుల అప్పాచారి, చింతోజు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'అత్యున్నత న్యాయస్థానాన్ని బీజేపీ కలుషితం చేస్తోంది'

బోనకల్లు, సెప్టెంబర్ 17: అత్యున్నత న్యాయస్థానాన్ని బీజేపీ కలుషితం చేస్తూ దేశ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తోందని సీపీఎం నాయకుడు యనమదల విక్రం ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని రావినూతల గ్రామంలో మంగళవారం జరిగిన సీపీఎం గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

వైరా రూరల్, సెప్టెంబర్ 17: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల్లో అమరుల ప్రాణత్యాగాలు చరిత్రలో మిగిలిపోతాయని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మండలంలోని ఖానాపురం గ్రామంలో పోరాట వారోత్సవాలలో భాగంగా జమిందార్ దారికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి పోలీస్ కాల్పుల్లో మృతిచెందిన కుక్క వెంకటేశ్వర్లు, ఏగంటి నారాయణ స్మారకస్థూపాల వద్ద నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సత్తుపల్లిలో..

సత్తుపల్లి టౌన్: మాట్లాడుతున్న ఆదినారాయణ

సత్తుపల్లిటౌన్, సెప్టెంబర్ 17: కమ్యునిస్టుల త్యాగాలతో నైజాం గద్దె దించిన విరోచిత పోరాటం తెలంగాణ సాయుధ పోరాటమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ పేర్కొన్నారు. మంగళవారం సత్తుపల్లిలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. విరోచిత తెలంగాణ సాయుధ పోరాటానికి మతం రంగు పులిమి గడుపుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ఆపదలో స్నేహ హస్తం..

వరదలకు అతలాకుతలమైన కుటుంబం

స్పందించిన పదో తరగతి ఫ్రెండ్స్

రూ.50 వేల ఆర్థిక సహాయం

ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 17: మహబూబాద్ జిల్లా కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన పుష్ప అనే మహిళ నగరంలోని బొక్కలగడ్డ ప్రాంతంలో వారి కుటుంబంతో కలిసి నివసిస్తుంది. ఇటీవల మున్నేటి వరదకు సదరు కుటుంబం సర్వం కోల్పోయింది. విషయం తెలుసుకున్న ఆమె పదో తరగతి ఫ్రెండ్స్ మంగళవారం ఖమ్మం వచ్చి పుష్ప కుటుంబం పరిస్థితిని అడగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బంది వచ్చినా మేమున్నాం అంటూ భరోసా కల్పించారు. వివిధ గ్రామాలు, ఆయా ప్రదేశాల నుంచి వచ్చిన స్నేహితులు బజ్జూరి లచ్చిరెడ్డి, బలగాని నవీన్‌కుమార్, అక్కినపల్లి రమేష్, సీహెచ్ ప్రవీన్, కొంపెల్లి అంజయ్య గౌడ్, కందుల దుర్గయ్య తమ స్నేహితుల సహకారంతో రూ.50వేలు ఇచ్చి ధైర్యాన్ని నింపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K.
9160900024 / 9640400073.
NT-331771-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బీజేపీవి మత రాజకీయాలు: సీపీఎం

ఎర్రుపాలెం, సెప్టెంబర్ 17: కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మత రాజకీయాలు దేశానికి ప్రమాదకరమని సీపీఎం మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య అన్నారు. ఎర్రుపాలెం, రేమిడిచర్ల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన గ్రామ శాఖల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు నూతన శాఖలను ఎన్నుకున్నారు.

నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ఘనంగా ప్రజా పరిపాలన దినోత్సవం

క్యాంపు కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కలెక్టరేట్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

జిల్లా పరిషత్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న జడ్పీ సీఈవో దీక్షారైనా

కొణిజర్ల: ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు,అధ్యాపకులు

సత్తుపల్లి టౌన్: ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

ఎంపీడీవో కార్యాలయంలో జెండా ఎగుర వేస్తున్న ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 17 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను తెలంగాణ ప్రజా పరిపాలన దినోత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో తెలంగాణ ప్రజా పరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జాతీయజెండాను ఆవిష్కరించారు. మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జడ్పీ సీఈవో దీక్షారైనా జాతీయజెండాను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో శిక్షణ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, డీఆర్‌వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న ఎంపీడీవో

మున్సిపాలిటీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

పోలీస్‌స్టేషన్‌లో జాతీయజెండాను ఎగురవేసి వందనం చేస్తున్న ఎస్సై వెంకటేష్

దళితబంధు యూనిట్లు అమ్మడం, కొనడం నేరం

- యూనిట్లను వాపస్ చేయించాల్సిన బాధ్యత ప్రత్యేకాధికారులదే..
- రెండో విడత మిగులు నిధుల పంపిణీలో డిప్యూటీ సీఎం భట్టి

లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

చింతకాని, సెప్టెంబర్ 17: దళితబంధు పథకం ద్వారా యూనిట్లు పొందిన దళితులంతా తమ యూనిట్లను విక్రయించడంగానీ, ఇతరులు కొనుగోలు చేయడంగానీ నేరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఒకవేళ విక్రయించితే యూనిట్లను తిరిగి లబ్ధిదారులకు వాపస్ చేయించాల్సిన బాధ్యత ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులదేనని అన్నారు. దళితబంధు పైలట్ ప్రాజెక్టు అయిన చింతకాని మండలంలో 847 మంది కుటుంబాలకు మంజూరైన రెండో విడత మిగులు నిధులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలిసి పంపిణీ చేశారు. మండలంలోని నాగులవంచ గ్రామంలో మంగళవారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో దళిత కుటుంబాలన్నింటికీ దళితబంధు పథకం మంజూరులో భాగంగా మొదటి విడతలో సంపూర్ణంగా సాయం అందని కుటుంబాలను మిగిలిన సాయం అందిస్తున్నామని అన్నారు. ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకొని వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అలాగే, అతి త్వరలోనే గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటి నిర్మాణాలు చేపట్టనున్నామని, ఇంటి నిర్మాణాల కోసం నిరు పేదలకు రూ.5 లక్షల సాయాన్ని అందించనున్నామని వివరించారు. అలాగే, భూమిలేని నిరుపేదలకు రూ.12 వేల ఆర్థిక సాయాన్ని కూడా అందించనున్నట్లు చెప్పారు. రైతుల ఆర్థిక వెసులుబాటు కోసం సోలార్ వ్యవసాయ పంపుసెట్లు తీసుకొస్తున్నామన్నారు. మధిర నియోజకవర్గంలోని సిరిపురం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని, గ్రామంలోని ప్రతి రైతుకూ పూర్తి ప్రభుత్వ ఖర్చుతో సోలార్ వ్యవసాయ పంపుసెట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రానున్న ఐదేళ్లలో ఐకేపీ మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలను అందిస్తామన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ, ట్రైనీ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు, డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్, డీఆర్డీవో సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

రాకాశితండా బాధితులకు చీరెలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 17 : మండలంలోని రాకాశితండా వరద బాధితులకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు విరివిగా సహాయం అందిస్తున్నారు. మండలంలోని దమ్మాయిగూడేనికి చెందిన స్వర్గీయ కొప్పుల దేవయ్య-జయమ్మ మనవడు గాజుల సంజయ్‌దేవ్ పుట్టినరోజు సందర్భంగా రాకాశితండా వరద బాధితులకు మంగళవారం చీరెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, దిలీప్, సౌజన్య, రాజెందర్, సింధు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

మధిర, సెప్టెంబర్ 17 : కలెక్టర్ ఏర్పాటు చేసిన 'నా ఖమ్మం కోసం నేను' కార్యక్రమంలో భాగంగా సామాజిక సేవకుడు లంకా కొండయ్య, ఎంపీడీవో బీ.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాంబాబు, డాక్టర్ పృథ్వి, డాక్టర్ వీర బాబు, డాక్టర్ అనిల్‌కుమార్ పిలుపు మేరకు మధిర పట్టణంలోని టీవీఎం వాకర్స్‌క్లబ్ సభ్యులు కొన్ని వస్తువులు, దుస్తులు, బియ్యం, స్టీల్ సామాన్లతో వితరణ చేసి సంఘ సేవకుడు లంకా కొండయ్య ద్వారా మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో దొడ్డ శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్టు మక్కెన నాగేశ్వరరావు, పుల్లఖండం చంద్రశేఖర్, రాచకొండ వెంకటేశ్వర్లు, టీవీఎం వాకర్స్ క్లబ్ సభ్యులు బట్టలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ టీఎల్ఎన్ శాస్త్రి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, లంకా సేవా ఫౌండేషన్ వలంటీర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు సామగ్రి, దుస్తులు అందజేస్తున్న దృశ్యం

తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎంఎస్పీ నాయకులు

'వరద బాధితులకు నష్టపరిహారం అందించాలి'

ఎర్రుపాలెం, సెప్టెంబర్ 17: మండలంలోని చొప్పకట్లపాలెం, కొత్తపాలెం తదితర గ్రామాల్లో నిజమైన వరద బాధితులకు నష్టపరిహారం అందించాలని ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు కూరాటి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

స్వచ్ఛతవైపు అడుగులు వేద్దాం

వేంసూరు: కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వేంసూరు, సెప్టెంబర్ 17: గ్రామాల్లో ప్రతిఒక్కరూ పారిశుధ్యంపై దృష్టి సారించినట్లైతే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని, దానికి అనుకూలంగా స్వచ్ఛతవైపు అడుగులు వేద్దామని ఎంపీవో రంజిత్‌కుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతహే సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని దుద్దిపుడి, కందుకూరు గ్రామాల్లో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్యదర్శులు సునీత, వినీష, ఆరోగ్య సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిష్టారంలో ఓసీలో..

సత్తుపల్లి టౌన్, సెప్టెంబర్ 17: మండలంలోని కిష్టారం ఓసీలో స్వచ్ఛత- పెండెన్సీని తగ్గించడం కోసం ప్రత్యేక ప్రచారం-4 సందర్భంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కాలరీ మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం వల్ల స్వచ్ఛత సంస్థాగతీకరణ, ఆఫీస్‌లో పెండెన్సీని తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇంజినీర్ వీరప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు భరణి, ఐఎన్‌టీయూసీ నాయకులు అఫ్‌రోజ్, సంక్షేమాధికారి విజయ్‌సందీప్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే ప్రగతి సాధ్యం: ఎంపీడీవో

కూసుమంచి, సెప్టెంబర్ 17: పచ్చదనంతో వాతావరణ కాలుష్యం తగ్గుతుందని, ప్రగతి సాధ్యమవుతుందని ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఎంపీవో రామచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మధిరలో..

మధిర, సెప్టెంబర్ 17: మధిర మున్సిపాలిటీలోనూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, సొసైటీ చైర్మన్ బిక్కి ప్రసాద్, కమిషనర్ షఫీ ఉల్లా తదితరులు పాల్గొన్నారు.

మధిరలో టూరిజం అధికారుల పర్యటన

మధిర ట్యాంక్ పర్యాటక ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మధిర, సెప్టెంబర్ 17 : రాష్ట్ర టూరిజం అధికారులు మధిర మండలంలో మంగళవారం పర్యటించారు. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూశాఖ అధికారులతో కలిసి మధిర ట్యాంక్‌బండ్‌ను పరిశీలించారు. సంబంధిత నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నారు. కార్యక్రమంలో తెలంగాణ జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి, తెలంగాణ టూరిజం ఎస్ఈ సరిత, కన్సల్టింగ్ ఆఫీసర్ అర్కిటెక్ట్ స్మిత, జిల్లా పర్యాటక శాఖ అధికారి బీ.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి: అదనపు కలెక్టర్

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ముదిగొండ, సెప్టెంబర్ 17 : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో గంటన్నరసేపు గడిపి వారికి చదువుపై ప్రేరణ కలిగేలా మాట్లాడారు. వారితో కలిసి పాఠాలు విని ప్రశ్నలు సంధించారు. పాఠశాల రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఇందిర, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మధిర, సెప్టెంబర్ 17: రాష్ట్ర సచివాలయం ఎదుట రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటుచేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపులో భాగంగా మధిరలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణతో ఏ విధమైన సంబంధమూలేని వ్యక్తి విగ్రహాన్ని సచివాలయం ఎదుట ప్రతిష్ఠించడమంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టడమేనని విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ఆస్తిత్వంతో పెట్టుకుంటే పుట్టగతులు ఉండవు

కందుకూరులో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

వేంసూరు, సెప్టెంబర్17: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం తన ప్రాణాలు సైతం లెక్క చేయకుండా ముందుకు వెళ్లారని, తెలంగాణ అస్తిత్వంతో పెట్టుకుంటనంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుట్టగతులు ఉండవని ఉద్యమకారుడు బండి అంజిరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం మండలంలోని కందుకూరు గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గొర్ల ప్రభాకర్‌రెడ్డి, బండి ఉపేందర్‌రెడ్డి, రాయల సత్యనారాయణ, మురళీ, నాగరాజు, పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన బాబ్జిప్రసాద్

బాబ్జి ప్రసాద్

వేంసూరు, సెప్టెంబర్ 17: వేంసూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎంఏ రాజు అనారోగ్య సమస్యలపై సెలవుపై వెళ్లడంతో కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న బాబ్జిప్రసాద్‌కు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. మంగళవారం బాబ్జిప్రసాద్ ఇన్‌చార్జి తహసీల్దార్ బాధ్యతలు చేపట్టారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు

కొణిజర్ల, సెప్టెంబర్17: విశ్వబ్రాహ్మణులు ఆధ్వర్యంలో కొణిజర్లలో శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా వేదపండితులు సత్తెనపల్లి కృష్ణమాచారి ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ జెండాను విశ్వబ్రాహ్మణసంఘం మండల అధ్యక్షుడు నెమలికొండ రామకృష్ణాచారి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ నెల్లూరి రమేష్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

బియ్యం, నిత్యావసర సరుకులు అందజేత

పెనుబల్లి, సెప్టెంబర్17: లయన్స్‌క్లబ్ సభ్యుడు రామడుగు రాజా కుమార్తె జ్ఞానమైక్య పుట్టినరోజు సందర్భంగా పెనుబల్లికి చెందిన నిరుపేద వృద్ధురాలు జెర్రిపోతుల కమలమ్మకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం బియ్యం, నిత్యవసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ షేక్ అబ్దుల్‌సలాం, ప్రెసిడెంట్ శ్రీధరాల సుబ్బారావు, వైస్‌ప్రెసిడెంట్ ఎస్ అనంత్, క్లబ్ సభ్యులు నేరేటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

'జాతీయ జెండా'కు అవమానం

రఘునాథపాలెంలో 'షూ' ధరించి జెండా ఎగురవేసిన అధికారి

రఘునాథపాలెం, సెప్టెంబర్ 17 : జాతీయ జెండాపై ఏమాత్రం గౌరవం లేకుండా ఓ ప్రత్యేకాధికారి కాళ్లకు షూ వేసుకొని జెండాను ఆవిష్కరించిన ఘటన రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం చోటు చేసుకుంది. ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎంఏ మహమూద్ తన కాళ్లకు ఉన్న షూ విడవకుండానే జాతీయజెండాను ఎగురవేశారు. దీంతో ఆయన తీరుపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

కుటుంబసభ్యుల వివరాలు నమోదు

ఎర్రుపాలెం, సెప్టెంబర్ 17 : మండల కేంద్రం ఎర్రుపాలెం రైతువేదికలో మంగళవారం రుణమాఫీ ప్రక్రియలో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కుటుంబసభ్యుల వివరాల నమోదు ప్రక్రియ పునఃప్రారంభించారు. రెండు లక్షల వరకు రుణమాఫీకి రేషన్‌కార్డు లేని రైతు కుటుంబాల నుంచి కుటుంబ వివరాల నమోదు ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో ఏవో ఎం.రాధ, ఏఈవోలు బాలకృష్ణ, కృష్ణకుమారి, రైతులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతి

మధిర, సెప్టెంబర్ 17 : ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు తూర్పుబజార్‌కు చెందిన కత్తుల శ్రీను(36) సికింద్రాబాద్ నుంచి గుంటూరు వెళ్లే ఇంటర్‌సిటీ రైలులో వచ్చి మధిర రైల్వేస్టేషన్‌లో దిగి అనారోగ్య కారణంతో మృతిచెందాడు. ఈ కేసును ఖమ్మం జీఆర్‌పీ ఎస్సై పీ.భాస్కర్‌రావు కేసు నమోదు చేయగా మధిర జీఆర్‌పీ అవుట్‌పోస్టు ఇన్‌చార్జి ఎస్.గోపాల్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో దాడి.. కేసు నమోదు

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 17: మద్యం మత్తులో పోలీసులపై దాడి చేసిన ఘటనలో పలువురు యువకలపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణేష్ నిమజ్జనం సందర్భంగా సోమవారం రాత్రి ఖమ్మం పాత బస్‌స్టాండ్ సమీపంలో విధులు నిర్వహిస్తున్న ఖమ్మం వన్‌టౌన్ సీఐ, సిబ్బంది పై మద్యం మత్తులో ఉన్న కొందరు యువకులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో సీఐ కుడి చేతికి గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు దాడికి పాల్పడుతున్న నిందితులు సాయి స్వరూప్, డోన్‌వాన్ అశోక్, అరుణ్, రవీంద్రతో మరి కొంత మందిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

రఘునాథపాలెం, సెప్టెంబర్ 17: వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనలో ఆరుగురిపై ఖానాపురం హవేలీ పోలీసులు మంగళవారం కేసు న